# అహం మాయం

**అల్లాడ స్నేహలత**



**పార్టీనుండి ఇంటికి వచ్చిన నందగోపాల్ విసురుగా గేటు తీసి లోపలికి వచ్చి, డోర్‌లాక్ ఓపెన్ చేసి తలుపుని కోపంగా ఒక్క తన్ను తన్ని లోపలికి ప్రవేశించాడు. అంతవరకూ అతికష్టం మీద బిగపట్టుకున్న కోపం ఇంటికి రాగానే బుస్సున లేచింది. వెనక వచ్చిన గాయత్రి గజగజలాడిపోతోంది భయంతో. అతని కోపం మాటల రూపంలో బయటకు రాసాగింది.**

**"అసలు నిన్ను పార్టీకి తీసికెళ్ళడం నాదే బుద్ధి తక్కువ!" అని మొదలుపెట్టాడు. ఊహించినంతా అయింది అనుకుంది గాయత్రి. ఈ సంవత్సరంన్నర వైవాహిక జీవితంలో చూడని అతని ఉగ్రరూపం ఆమెను గడగడలాడిస్తోంది. అసలే అమాయకురాలు.**

"అందుకే నేను రానన్నాను గదండీ. మీరేగదా..." బిక్కుబిక్కుమంటూ అంది.

"అదే నేను చేసిన బుద్ధి తక్కువ పని. వచ్చి నా పరువు తీశావ్‌గదే!"

"అంత పరువు తీసే పని నేనేం చేశానండీ?"

"మాట్లాడకింక. అసలు నిన్ను పెళ్ళి చేసుకోవడమే నేను చేసిన పెద్ద తప్పు. మా వాళ్లంతా 'చదువు అంతగాలేని పిల్లని, పెద్ద చదువు చదివిన నువ్వు చేసుకోవడమేమిట్రా? ఎంత అందగత్తె అయితే మాత్రం' అని ఎన్ని విధాల చెప్పినా, మొండిపట్టు పట్టి, అతిలోక సుందరివని, నీ అందానికి మొగ్గి నిన్ను చేసుకున్నందుకు ఇప్పుడు తెలిసి వస్తోంది నా పొరపాటు. గుదిబండను తగిలించుకున్నట్టయింది" కసినంతా కరుకు మాటల్లో వెళ్లగక్కాడు నందగోపాల్.

"గుదిబండనా? ఎంతమాట అనేశారు? ఏదో చిన్న పొరపాటుకే ఇంతింత మాటలనాలా?" దుఃఖం వస్తోంది గాయత్రికి. "ఇదివరకు కూడా అలాంటి పొరపాటు మాటలంటే మీరు నవ్వుతూ అలాకాదు ఇలా అని సరిదిద్దేవారు. అలాంటిది ఇంత కోపమా? ఇదంతా వాళ్ల ఎగతాళి నవ్వుల వల్లే మీకంత కోపం వచ్చింది"

భయంలోనైనా ధైర్యంగా యధార్థం అంది అనిపించింది నందగోపాల్‌కి.

అయినా బెట్టుసరిగా "ఇంక మాట్లాడక. అవతలికి పో!" అని కసిరికొట్టాడు.

గాయత్రి ఏడుస్తూ వెళ్ళిపోయిందవతలికి.

'పాపం! అమాయకురాలు! చిన్న విషయానికింత కోపం చూపిస్తావా? ఎలా బాధపడ్తుందో

చూడు. నువ్వు కాస్త మూడీగా ఉంటేనే గాయత్రి తల్లడిల్లిపోతుందే! అలాంటిదాన్ని, అన్ని మాటలతో బాధించి, బాధపడ్తుంటే చూస్తూ కూర్చున్నావా? వెళ్ళి సముదాయించరాదూ!' అని అంతరాత్మ హితవు చెప్తుంటే...'మగాడివి! బెట్టుగా ఉంటేనే ఉత్తమం. ఆడదానికి లోకువ అవకు' అని అహం హెచ్చరిస్తూంది.

అసలు జరిగిన విషయం ఏమిటంటే....

ఆ సాయంత్రం నందగోపాల్ ఆఫీసునుండి రాగానే "గాయత్రీ! నా ఫ్రెండ్ కొడుకు బర్త్‌డే పార్టీ వుంది. మనం వెళ్లాలి రెడీ అవు" అని చెప్పాడు.

"నేనెందుకండీ! మీరొక్కరే వెళ్ళిరండి!" అంది గాయత్రి.

"ఎందుకంటావేమిటి? మా ఫ్రెండ్స్, వాళ్ళ భార్యలు కూడా వస్తారు. నువ్వు రాకపోతే బాగుండదు. ఎందుకు తీసుకురాలేదని నన్ను నిలదీస్తారు కూడా! సో! నువ్వూ రావాలి" అన్నాడు.

"వద్దండీ! మీ స్నేహితులంతా గొప్ప గొప్పవాళ్ళు. బాగా చదువుకున్న వాళ్లు. వాళ్ల మధ్యలోకి రావాలంటే నాకు జంకుగా వుంటుంది. అదీగాక మీ పక్కన నేను తీసికట్టేగదండీ!" గాయత్రి మాటకి నందగోపాల్‌కి నవ్వాగలేదు.

పకపకా నవ్వుతూ "నా పిచ్చి గాయత్రీ! నీది అద్భుతమైన, అపురూప



మైన సౌందర్యం. నీది ముగ్ధ మోహన రూపం. నువ్వు నా పక్కనుంటే నాకెంతో గొప్ప! అంతకన్నా యిష్టం. ఇంకేం సందేహించకు. త్వరగా తయారవు" అని గాయత్రిని ఊపిరి సలవపనివ్వకుండా తొందర పెట్టాడు నందగోపాల్.

స్నానం చేసి ముస్తాబై వచ్చిన గాయత్రిని చూసి అతని కనులు చెదిరిపోయాయి.


పింక్ కలర్ సిల్క్ శారీ, సేమ్ కలర్ బ్లౌజ్, చేతులనిండా బంగారు గాజులు మధ్య పింక్ కలర్ గాజులు, నుదుట సూర్యబింబంలా మెరిసే కుంకుమ, కనులకు కాటుకరేఖ, మెడలో గొలుసుతోపాటు నల్లపూసల లాకెట్ చెయిన్. ఈ సాధారణ అలంకరణలో గాయత్రి అందం ఇంకా ఇనుమడించింది.

"ఆహా! అద్భుతం! నీ అందం పదిరెట్లు పెరిగింది నీ ముస్తాబుతో!" అని పొగిడాడు.



## నమిత గొప్పలు!

నమితకి ఈమధ్య సినిమాల జోరు తగ్గిందే చెప్పొచ్చు. తమిళంలో నిన్న మొన్నటిదాకా బిజీగా వున్న నమితకి ఇప్పుడు చేతిలో సినిమాలు అంతగా లేవనే చెప్పాలి. అయితే ఈవిషయం నమిత ఎంతమాత్రం ఒప్పుకోవడంలేదు. తనెంతో బిజీగా ఉంటున్నట్లు బిల్డప్ ఇస్తోంది. సినిమా కథలు నచ్చక 14 సినిమాలు తిరస్కరించినట్లు చెబుతోంది. ఆమె మాటలు విన్న సినీజనాలు 'గొప్పలు చెప్పుకోవచ్చుగానీ మరీ అంతగానా?' అని ఆశ్చర్యపోతున్నారు.




"ఇప్పుడు శ్రీనాధుడే ఉంటే నీ అందం చూసి ఉంటే, నిన్నే కావ్యనాయికగా వించుకుని, మరో మధుర శృంగార కావ్యానికి శ్రీకారం చుట్టేవాడేమో!"

అంత పెద్ద మాటలు గాయత్రికి అర్థం కాలేదు. తనని తెగ పొగుడుతున్నాడని మాత్రం అర్థమయింది.

భర్త మాటలకి సిగ్గుపడుతూ, మల్లెల మాలని తన బారెడు వాల్జడలో తురుముకుంది.

నడుముని దాటి, పిరుదులపై దరువేస్తున్నట్లు కదలాడే గాయత్రి వాల్జడంటే నందగోపాల్‌కి చాలా ఇష్టం.

ఇపుడా అందమైన జడకు మూడు మూరల మల్లెలమాల తోడై, అతని మనసులోని భావుకతను తట్టి లేపింది. ఆ భావుకత పాటగా మారి అతని పెదవులు దాటింది.

"తలనిండా పూదండ దాల్చిన నా రాణి, మొలక నవ్వులతోడ నన్ను మురిపించరావే" అంటూ రెండు చేతులూ చాచాడు. తన బాహుల్లో బందీని చేశాడు.

ఆ ప్రేమ పరిష్వంగంలో గాయత్రి.

గాయత్రి అందానికి ముగ్ధుడై పోతూ నందగోపాల్ పరవశించిపోయారు కొన్ని క్షణాలు.

"ఇంక చాల్లే వదలండి చీర కాస్తా నలిగిపోతుంది"

"అవును కదూ! అయితే సరే!" అని గాయత్రిని తన బాహుబంధనం నుండి విముక్తను చేసి "పద! బయలుదేరుదాం" అన్నాడు.

ఇద్దరూ ఉల్లాసంగా బైక్‌మీద బయలుదేరారు.

పార్టీలో అందరి కళ్ళూ గాయత్రి మీదే నిలిచాయి. గాయత్రి స్పెషల్ ఎట్రాక్షన్ అయిందక్కడ.

'ఏమి అందం!' అనుకున్నారు చాలామంది. నందగోపాల్ సన్నిహితులైతే ఏకంగా పొగడడమే మొదలుపెట్టారు.

నందగోపాల్ తన ఫ్రెండ్స్‌ని, వాళ్ల భార్యలని పరిచయం చేస్తుంటే, అందరికీ సవినయంగా నమస్కరించింది గాయత్రి. ఒక మధ్య వయస్కురాలు నందగోపాల్ దగ్గరకు వచ్చింది. "నందగోపాల్! నువ్వు చాలా అదృష్టవంతుడివి. అమ్మాయి అందాల బొమ్మే కాదు. సుగుణాలరాశి. ఆ వినయం, నమ్రత చూస్తుంటే ముచ్చటేస్తుంది. ఈ కాలంలో ఇంత ఇదిగా ఎవరుంటున్నారు!" అంది.

నందగోపాల్‌కి చాలా సంతోషం కలిగిందామాటలకి. గాయత్రి ఆ పొగడ్తకి సిగ్గుపడి తలవాల్చుకుంది.

నందగోపాల్ మాత్రం గాయత్రి వంక మురిసిపోతూ చూస్తున్నాడు. ఆ మురిపెం ఒక సంఘటనతో మాయమై కోపంగా మారింది.

గాయత్రిని మాటల్లో పెట్టింది ఒకావిడ. ఆ మాటా ఈ మాటా అయ్యాక "గాయత్రిగారూ! మీరు సినిమాలు చూస్తుంటారా?" అని అడిగింది.

యధాలాపంగా దానికి సమాధానంగా గాయత్రి "పెళ్ళి అయ్యాక నాలుగైదు సినిమాలు చూశానండి. కానీ నాకంతగా నచ్చలేదు" అంది.

"ఎందుకండీ?" అడిగిందావి.

"ఆ! ఏమో! ఒంటిమీద బట్టలు సరిగాలేక ఆ చిందులూ, గెంతులూ నాకు నచ్చలేదు" గాయత్రి మాటవిని 'ఈ కాలంలో పిల్లలా లేదు' అనుకుందావిడ. అంతటితో ఆగితే బాగుండేది.

"మరెలాంటివైతే నచ్చుతాయి?" అడిగిందావిడ.

"భక్త ప్రహ్లాదలాంటి సినిమాలైతే నాకు చాలా యిష్టం" అంది గాయత్రి.

ఆ మాటతో అందరికీ నవ్వు వచ్చింది. నందగోపాల్ కూడా గాయత్రి మాటకు నవ్వుకున్నాడు. కొందరు వచ్చే నవ్వుని ఆపుకున్నారు.

ఒకతనైతే చనువుగా, జోక్‌గా "మీ భర్త ప్రహ్లాదంటే ఇష్టమా?" అని

నవ్వుతూ "ఏమోయ్! ప్రహ్లాదా!" అని నందగోపాల్‌తో అన్నాడు.

అతని మాటలు అక్కడున్న కొందరు నవ్వారు.

వాళ్ళలా నవ్వుతుంటే ఇన్‌సల్ట్‌గా ఫీలయిపోయాడు నందగోపాల్. అప్పుడు వచ్చింది అతనికి కోపం విపరీతంగా. అంతకు ముందు భార్యని చూసి మురిసిపోతున్న అతని నగుమోము కందగడ్డలా మారింది గాయత్రి మీద కోపంతో.

గాయత్రికి తన మాట పొరబాటు తెలిసి రాలేదు. తెలిస్తే అనేది కాదు గదా! భర్తకి కోపం రావడానికి కారణం వాళ్ళు హేళనగా నవ్విన నవ్వులే అనిపించింది అమాయక గాయత్రికి. అంతేగాని తన మీద కోపం అని గ్రహించుకోలేకపోయింది.

"ఎందుకలా నవ్వుతారు? మా ఆయనకి కోపం వస్తుంది" అనేసింది అమాయకంగా.

"ఏం? మీ ప్రహ్లాద్‌కి కోపం రాగూడదా?" అతని మాటకింకా నవ్వుతున్నారు. అప్పుడు ఆ మధ్య వయసావిడ కల్పించుకుంది.

"ఎందుకలా నవ్వుతారు? తప్పుగదూ!" అని మందలించింది.

"చూడమ్మా గాయత్రీ! భర్త అంటే ఎవరు?"

"పెనిమిటి!"

"కదా! మరి ప్రహ్లాదుడెవరు?"

"విష్ణు భక్తుడు"

"అదీ! ప్రహ్లాదుడు గొప్ప భక్తుడు గనుక భక్త ప్రహ్లాద్ అన్నమాట!"

"నిజమే పిన్నిగారూ! ఏమిటో సరిగ్గా తెలీదు. మీ అందరిలా బాగా చదువుకున్నదాన్ని కాదు గదా!" అంది. అప్పుడు గ్రహించుకుంది. అయితే భర్తకి తనమీదే కోపం అన్నమాట! అందుకే వెంటనే "ఈ పిన్నిగారు చూడండి! తెలియని దానిని అని ఎలా చక్కగా వివరించి చెప్పారో! అదీ సంస్కారమంటే!" అంది.

ఆ మాటతో వాళ్ళ నవ్వులూ ఆగిపోయాయి. ముఖాలూ మాడిపోయాయి. తమకి సంస్కారం లేదని ఇన్‌డైరెక్టుగా తెలియచేసిందని గ్రహించుకున్నారు.

"సారీ ప్రహ్లా..." అనబోయి నందగోపాల్ కళ్లెఱ్ఱ చేసేసరికి, నాలిక కరుచుకున్నాడా ఫ్రెండ్ "సారీ నందగోపాల్! రియల్లీ సో సారీ!" అన్నాడు.

"ఓకే! ఓకే!" సభ్యతకి అన్నాడుగాని నందగోపాల్‌కి కోపం మాత్రం తగ్గలేదు. పార్టీలో మూడీగానే ఉండిపోయాడు.

అతని వాలకం చూసి గాయత్రి హడలిపోయింది. తను భయపడినట్టుగానే, ఇంటికి రాగానే గాయత్రి మీద కోపం చూపించాడు. ఘోరమైన మాటలు అన్నాడు.

గాయత్రి తల్లి, తండ్రి చిన్నతనంలోనే పోయారు. దుష్టబుద్ధిగల మేనమామ పెంపకంలో నానా బాధలూ పడింది చిన్నతనం నుండి.

పెళ్లి అయిన కొత్తలోనే గాయత్రి తన గత జీవితగాథ అంతా చెప్పింది కన్నీళ్లతో. నందగోపాల్ చాలా జాలిపడ్డాడు.

"గాయత్రీ! గతం మర్చిపో. ఇంకనుండి నీకే కష్టం రానివ్వను. నీకు నేనున్నాను. నీకు గతం గుర్తురానంతగా నిన్ను సుఖసంతోషాలలో ముంచెత్తుతాను" అని ఓదార్చాడు. అన్నట్టుగానే గాయత్రిని అపురూపంగా ప్రేమగా చూసుకుంటున్నాడు.

అటువంటి భర్త ఈనాడు తనని గుదిబండగా భావించాడు. అదే మాట పదేపదే గుర్తు వస్తూ గాయత్రిని వేధిస్తూంది. తన చిన్న పొరపాటుకి అంత పెద్ద శిక్షా! అనిపించింది గాయత్రికి.


***

గాయత్రి భయం భయంగానూ, నందగోపాల్ కోపంతో రుసరుసలాడుతూ ఉండగా రోజులు గడిచిపోతున్నాయి. పది రోజులవరకూ వాళ్ళ మధ్య మౌనం అలాగే ఉంది.

'నీకిది తగదు' అని నందగోపాల్‌ని అంతరాత్మ హెచ్చరిస్తుంటే, అహం అడ్డువచ్చి అతన్ని శాంతింపనీయకుండా చేస్తోంది.

ఆఫీసునుండి ఇంటికి వచ్చిన నందగోపాల్, ఇంటి తలుపులు బార్లా తెరచి ఉండడం చూసి ఆశ్చర్యపోయాడు. తను వచ్చి బెల్‌కొడితే వచ్చి కిటికీలోనుండి తనని చూసి గాని గాయత్రి తలుపు తీయదు. అందుకే అతనికంత ఆశ్చర్యం.

లోపలికి వచ్చి చూస్తే గాయత్రి చాపమీద పడుకుని ఉంది. చేతిలో మడతపెట్టిన తెల్లకాగితం ఉంది. అతని మనసు కీడును శంకిస్తుండగా, గాయత్రిని తట్టి చూశాడు. కదలికలేదు. గాబరాగా కాగితం తీసి ఆత్రంగా చదివాడు.




## జ్యుపిటర్ రోజు 10 గంటలు

అన్ని గ్రహాలలోనూ అతి వేగంగా తన చుట్టూ తాను పరిభ్రమించేది జ్యుపిటర్. ఒక పరిభ్రమణానికి పట్టేది మన కాలమానంలో 10 గంటలు. అంటే ఆ ఆ గ్రహానికది ఒక రోజన్నమాట.

## చేసేదేంలేదు

అమెరికాలో ఆర్థిక మాంద్యం ప్రభావం ఇంకా వదలక అనేకమంది అప్పులపాలయిపోయి, కార్లను అమ్మితే కొనేవాళ్లు లేక ఇన్సూరెన్స్ డబ్బు సంపాదించే మిషతో అనేకమంది తమ కార్లని తామే తగలబెట్టుకుంటున్నారుట!

-తటవర్తి



'పూజ్యులైన శ్రీవారికి నమస్కారములు,

ఈ సంవత్సరంన్నర నాకు మీరు వైభోగ జీవితం ఇచ్చారు. సకల సౌకర్యాలూ సమకూర్చి సంతోష పెట్టారు. లెక్కలేనన్ని కృతజ్ఞతలు. నా అంత అదృష్టవంతురాలు లేదు అనుకునేంతంతగా నన్ను ప్రేమించారు. నా అదృష్టాన్ని నేనే జారవిడుచుకున్నానేమో! ఇంక మీకు గుదిబండగా ఉండలేక వెళ్ళిపోతున్నాను. క్షమించండి.

ఇట్లు
మీ గుదిబండ'

"నో! నో!" గట్టిగా అరిచాడు గుండెలవిసేలా.

"ఏమిటండీ! ఏమయింది? అంత గట్టిగా అరిచారు" అంటూ గాబరాగా, గాయత్రి కుదిపి లేపితే గాని అతనికి అర్థం కాలేదు. 'మైగాడ్! కలా?'

కల ప్రభావమేమో అతనికింకా గుండె దడదడలాడుతూనే ఉంది. భార్య వంక గుడ్లప్పగించి అలా చూస్తుండిపోయాడు.



## ఆల్ ది బెస్ట్!

తెలుగు అమ్మాయిలా కనిపించే పంజాబీ అమ్మాయి ఛార్మికి ఇప్పుడు చేతిలో సినిమాలు లేకపోవడం ఆమెను ఎంతో నిరాశకు గురి చేస్తోంది. తెలుగులో స్థిరపడాలనే ఉద్దేశ్యంతో ఛార్మి హైదరాబాద్‌లో సొంత ఇల్లు కూడా సమకూర్చుకుంది. కానీ ఏం లాభం? ఇక ఇక్కడ చేసేదేంలేక మళయాళానికి వెళ్లిన ఛార్మికి అక్కడైనా విజయాలు దక్కాలని కోరుకుందాం!




"ఏమైనా పీడకల వచ్చిందాండీ?" అడిగింది గాయత్రి లాలనగా. తలూపాడు.

అమ్మో! ఎంత దుస్వప్నం! ఎందుకిలా వచ్చింది. తను గాయత్రిని ఘాటైన మాటలతో బాధించిన అపరాధ బావం తన మనసులో ఉండి ఇలా వచ్చిందా?

లేక గాయత్రి తన మాటలకి హర్ట్ అయి ఏదైనా అఘాయిత్యం తలపెట్టడానికి పూనుకుంటుందా? ఏమిటి ఈ కల అర్థం? అయోమయంగా ఉండిపోయాడుగాని మాట్లాడలేకపోయాడు. అంత షాక్‌లో ఉండిపోయాడు.

'ఒకవేళ గాయత్రిగాని....' ఆ ఊహే అతన్ని భయకంపితుణ్ణి చేసింది. గాయత్రి లేని జీవితం తనకి శూన్యమేగదా! ఆ తలపే అతన్ని గజగజలాడించింది.

అది గమనించిన గాయత్రి "అంతగా భయమెందుకండీ? కలే కదండీ" అంటూ చిన్న పిల్లాడిని ఓదార్చినట్టు చెప్పి అతని క్రాఫ్‌ని నిమురుతూ, ఛాతిమీద సవరదీస్తూ ఉండిపోయింది.

తర్వాత లేచి వెళ్ళి సాయిబాబా విభూది తెచ్చి అతని నుదుటిమీద, ఛాతిమీద పెట్టింది.

'మాయదారి కల! అంత మనిషి ఎలా అయిపోయారో!' అంటూ తెగ బాధపడిపోయింది.

"ఉండండి! వేడి వేడి పాలు తెస్తాను. అవి తాగితే హాయిగా నిద్రపడుతుంది" అని లేవబోయింది.

"పాలూ వద్దు. నిద్రా వద్దు. నువ్వే కావాలి. వెళ్ళకు" అంటూ చేయి పట్టుకున్నాడు. "గాయత్రీ! నన్ను వదలి వెళ్ళిపోకు"

"నేనెక్కడికి వెళ్తానండీ! పాలు తేవడానికి..అంతే!"

"గాయత్రీ! ఎప్పుడైనా నేను కోపం చూపి నిన్ను ఏదైనా అంటే నన్ను వదలి వెళ్ళిపోతావా?" బేలగా అడిగాడు.

"ఏమిటండీ మీ మాటలు! నేను వెళ్ళిపోయినట్లు కల కన్నారా ఏమిటి? నేనెక్కడికి వెళ్తానండి? నాకెవరున్నారు మీరు తప్ప. నాకు చెందాల్సిన ఆస్తినంతా కాజేసి మా మామయ్య, మీతో తూతూ మంత్రంగా పెళ్ళి చేసి, మీకు నన్ను అంటగట్టి నన్ను వదిలించుకున్నాడు. చచ్చేదాకా మీ దగ్గరే ఉండాల్సినదానిని. మీకు గుదిబండనే!" ఆఖరి మాటలకు కనులు చెమర్చాయి గాయత్రికి.

ఆ మాటలతో అతను చలించిపోయాడు. గాయత్రి రెండు చేతులూ పట్టుకున్నాడు.

"గాయత్రీ! నువ్వు నాకు గుదిబండవి కాదు. నా గృహలక్ష్మివి. నిన్ను అనగూడని మాట అన్నాను. కోపంలో నాకు వివేకం నశించింది. నన్ను క్షమించు గాయత్రీ!"

"అంత మాట అనకండీ! నేనెంత మిమ్మల్ని క్షమించడానికి? ఇంకెప్పుడూ ఇలా మాట్లాడకండి దయచేసి"

గాయత్రి సపర్యలతోనూ, లాలింపు మాటలతోనూ, అతని మనసుని ఆవరించుకున్న అహం మటుమాయమయింది. అతని మనసు మబ్బులు వీడిన ఆకాశంలా నిర్మలమైంది. ప్రేమ పొంగింది. గాయత్రిని గుండెలకదుముకుని నుదుట చుంబించాడు.

'చూశావా! నీ భార్య సుగుణాలతో నీలో ఉన్న అహంకారాన్ని పారద్రోలింది. మళ్లీ ఆ అహంకారాన్ని నీ మనసులోకి చొరబడనీయకు. హాపీగా జీవించండి. గుడ్‌లక్!' అంది అతని అంతరాత్మ.

★